క్లుప్తంగా

జగ్గంపేటలో 'ఆపరేషన్ స్వేచ్ఛ'

జగ్గంపేట: స్థానిక గుర్రంపాలెం రోడ్డులోని మహాలక్ష్మి ఫౌల్ట్రీ కాంప్లెక్స్ ఆవరణలో సోమవారం న్యాయ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. వెట్టి చాకిరీ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాది ఎం.రాంబాబు, లేబర్ ఆఫీసర్ జి.సత్యనారాయణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

తుని: ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నట్టు తుని పట్టణ సీఐ ఎం.నాగ దుర్గారావు తెలిపారు. పట్టణంలోని మెయిన్ రోడ్డు, బాలాజీ సెంటర్ ప్రాంతాలను సోమవారం ఆయన పరిశీలించారు. వాహనాలను పార్కింగ్‌కు నిర్దేశించిన ప్రదేశంలోనే నిలపాలన్నారు. రద్దీగా రోడ్లలోకి కార్లు, ఆటోలకు ప్రవేశం లేదన్నారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కోరారు.

మండలానికి చేరిన పశువుల దాణా


రైతులకు పశువుల దాణా అందిస్తున్న వ్యవసాయ సిబ్బంది

తొండంగి: మండలంలోని పాడి రైతులకు రాయితీపై ప్రభుత్వం సరఫరా చేస్తున్న టీఎంఆర్ పశువుల దాణా 25 టన్నులు మండలానికి చేరిందని బెండపూడి పశువైద్యాధికారి బి.చైతన్య సోమవారం తెలిపారు. గోపాలపట్నం, బెండపూడి, తొండంగి, శృంగవృక్షం తదితర గ్రామాలకు చెందిన రైతులు రాయితీపై పశువుల దాణాను రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేశారన్నారు. ఈ మేరకు 25 టన్నుల దాణాను ఆయా గ్రామాల పాడి రైతులకు అందించనున్నట్టు వివరించారు.

బీజేపీ కార్య వర్గ సమావేశం

కిర్లంపూడి: మండలంలోని వీరవరంలో భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గ సభ్య సమావేశం సోమవారం జరిగింది. బీజేపీ మండలాధ్యక్షుడు యడాలి రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దాట్ల కృష్ణవర్మ, స్టేట్ కౌన్సిల్ మెంబర్ గారపాటి రాజేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

చంద్రబాబు పర్యటన ఏర్పాట్లు పరిశీలన

గోకవరం/జగ్గంపేట: మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు ఈ నెల 15న జగ్గంపేట నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ మేరకు గోకవరం, జగ్గంపేట మండలాల్లో ఏర్పాట్లను సోమవారం మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, పెందుర్తి వెంకటేష్ పరిశీలించారు. చంద్రబాబు గోకవరం మండలంలోకి ప్రవేశించే గుమ్మళ్లదొడ్డి గ్రామంతో పాటు గోకవరం, జగ్గంపేటలో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసే ఏర్పాట్లను పరిశీలించారు. చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

త్వరలో శెట్టిబలిజ మహానాడు

బోట్‌క్లబ్: కాకినాడ నగరంలో త్వరలో పార్టీలకు అతీతంగా శెట్టిబలిజ మహానాడు నిర్వహించనున్నట్లు కాకినాడ జిల్లా శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు కందపల్లి వెంకటరమణ అన్నారు. స్థానిక రామారావుపేటలోని శెట్టిబలిజ హాస్టల్‌లో సోమవారం సంఘ సమావేశం జరిగింది. ఈ మహానాడులో పలు తీర్మానాలు చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్ర వైద్య ,ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ మాజీ చైర్మన్ యనమదల రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొన్ని వర్గాలకు సంవత్సరానికి రూ.10 వేలు ఇస్తోందని, కల్లు గీత కార్మికులకు కూడా ఈ ప్రయోజనం వర్తింపచేయాలన్నారు. వైఎస్సార్ సీపీ డాక్టర్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పితాని అన్నవరం మాట్లాడుతూ శెట్టిబలిజ సంఘీయులంతా కలిసికట్టుగా ఉండాలన్నారు. నూతనంగా ఎన్నికైన తుని పట్టణ శెట్టిబలిజ సంఘ నాయకులను సత్కరించారు. సంఘ సభ్యులు పెద్దింశెట్టి వేంకటేశ్వరరావు, పెంకె రాజు, వాసంశెట్టి త్రిమూర్తులు, పాలిక నాని, పాలిక రమణ, పిల్లి శంకర్, ఎల్లబోయిన చిన్న, కాద శివరామకృష్ణ పాల్గొన్నారు.

ప్రేమకు దీప్తి.. ప్రేమికులకు స్ఫూర్తి

మాటే మంత్రం, మనసే బంధం నీమమతే నీసమతే మంగళవాద్యం ఇది కల్యాణం కమనీయం జీవితం అన్నాడో సినీ కవి. ప్రేమ, పెళ్లిళ్లపై ఎంతో మంది మహానుభావులు అనేక నిర్వచనాలు ఇచ్చారు. భార్యాభర్తలు మధ్య ప్రేమ ఉంటే కులాలు, మతాలు వేరైనా..డబ్బు ఉన్నా.. లేకున్నా సుఖసంతోషాలతో ఆనందంగా జీవించవచ్చని నిరూపిస్తున్నాయి ప్రేమ పెళ్లి చేసుకున్న పలు జంటలు. మంగళవారం వాలంటైన్స్ డే సందర్భంగా ప్రేమ వివాహాలు చేసుకుని ఏళ్లతరబడి అన్యోన్యంగా..ఆనందంగా జీవిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్న ప్రేమికుల మనోభావాలతో ఈ ప్రత్యేక కథనం. – ఏలేశ్వరం, గోకవరం, రౌతులపూడి

ప్రేమించి.. పెద్దలను ఒప్పించి..


ప్రేమించి పెళ్లి చేసుకున్న అచ్చిరాజు, లోవలక్ష్మి

మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన పాశా అచ్చిరాజు, ఎం.కొత్తూరు శివారు దిగువ ధారపల్లి గ్రామానికి చెందిన పోపురు లోవలక్ష్మి నిరుపేద కుటుంబాలకు చెందినవారు. వారిద్దరు చిన్నతనం నుంచి చదువులో రాణించారు. డిగ్రీ పూర్తి చేసి ఎవరికి వారు ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించాలనుకున్నారు. 2007లో బీఎడ్ చదువుకునే రోజుల్లో వారి మధ్య ప్రేమ చిగురించింది. అనంతరం 2009 డీఎస్సీలో వారిద్దరు భౌతిక శాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగాలు సాధించారు. ఏడేళ్ల నిరీక్షించి 2014లో పెద్దల అంగీకారంతో వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం ఇద్దరు పిల్లలతో వారిద్దరు సొంత మండలంలోని ఉద్యోగాలు చేసుకుంటూ సంతోషంగా జీవితం సాగిస్తున్నారు.

ప్రేమించి.. పెద్దలను ఎదిరించి..


పెద్దలను ఎదురించి ప్రేమ వివాహం చేసుకున్న గొన్నూరి లాజర్, సూర్య కుమారి దంపతులు

గోకవరం గ్రామానికి చెందిన గొన్నూరి లాజర్, సూర్య కుమారి దంపతుల కులాలు వేరు. లాజర్ ఎస్సీ కులానికి చెందిన వ్యక్తి కాగా సూర్య కుమారి వైశ్య కులానికి చెందిన వారు. వారిద్దరూ సుమారు మూడేళ్ల పాటు ప్రేమించుకున్నారు. కులాలు వేరు కావడంతో పెళ్లికి ఇరువురి కుటుంబ పెద్దలు ఒప్పుకోలేదు. ఒకరినొకరు విడిచి ఉండలేక పెద్దలను ఎదురించి మే 12, 2000 సంవత్సరంలో గుమ్మళ్లదొడ్డి సత్యనారాయణస్వామి ఆలయంలో వివాహం చేసుకున్నారు. వీరికి ఒక అబ్బాయి, ఇద్దరు అమ్మాయిలు సంతానం. వివాహమై 22 సంవత్సరాలు అయినప్పటికీ సూర్యకుమారి తరపు వారు ఇప్పటికీ కలవలేదు. లాజర్ పీఎంపీగా ప్రాక్టీసు చేస్తుండగా సూర్యకుమారి చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్‌గా పని చేస్తున్నారు. 22 ఏళ్ల ప్రేమ వివాహ దాంపత్య జీవితంలో అన్ని విషయాల్లోనూ ఒక్కటిగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

30 ఏళ్లుగా సుఖ సంతోషాలతో..


జట్ల రాజారావు, ఉషాసత్యవేణి దంపతులు

ఏలేశ్వరం పట్టణానికి చెందిన జట్ల రాజారావు, ఉషాసత్యవేణి ఇంటర్ చదువుకునే రోజుల్లో ప్రేమించుకున్నారు. స్నేహితుల సహకారంతో 1994లో పెళ్లి చేసుకున్నారు. వారికి కుమార్తె, కుమారుడు ఇద్దరు సంతానం. ప్రేమ వివాహం చేసుకుని సుమారు 30 ఏళ్లు అయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ సుఖసంతోషాలతో హాయిగా కాలం వెళ్లదీస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

కులాలకు అతీతంగా..


ప్రేమించి పెళ్లి చేసుకున్న అశాలత, సతీష్ గోవిందుబాబు

ప్రేమ వివాహాలకు కులాలు అడ్డంకి కాదని ఏలేశ్వరం మున్సిపల్ కౌన్సిలర్ బదిరెడ్డి సతీష్ గోవిందుబాబు, అశాలత దంపతులు నిరూపించారు. వేర్వేరు కులాలకు చెందిన వీరు 2012లో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెళ్లయిన నాటి నుంచి ఎంతో అన్యోన్యంగా జీవిస్తున్నారు. ఒకరినొకరు అర్థం చేసుకుంటే ప్రేమ వివాహమే బెస్ట్ అని నిరూపిస్తున్నారు.

జగనన్న పాలవెల్లువపై అవగాహన

తుని రూరల్: పాడి రైతుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న పాల వెల్లువలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ పిలుపునిచ్చారు. మండలంలోని వి.కొత్తూరులో సోమవారం వెటర్నరీ వైద్యులు డాక్టర్ గోపి ఆధ్వర్యంలో జగనన్న పాల వెల్లువపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోతల రమణ మాట్లాడుతూ ప్రైవేట్ డెయిరీలు పాడి రైతులకు సరైన గిట్టుబాటు ధర చెల్లించడం లేదన్నారు. ప్రభుత్వం అమూల్ డెయిరీతో ఒప్పందం చేసుకోవడం వల్ల ప్రైవేట్ డెయిరీల కంటే అధికంగా రైతులకు గిట్టుబాటు ధర చెల్లిస్తున్నట్టు తెలిపారు. రైతుల ప్రయోజనాలు కాపాడే అమూల్ డెయిరీకి పాలను సరఫరా చేసి అధిక గిట్టుబాటు ధరను పొందాలన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దుంగల నాగేశ్వరరావు, ఎంపీటీసీ కిల్లి సన్యాసిరావు, నాయకులు బోజంకి వెంకటరమణ, సూరెడ్డి లోవరాజు, రైతులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన


బ్రహ్మాణ రేవు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ కిషోర్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: మహాశివరాత్రిని పురస్కరించుకుని స్థానిక బ్రహ్మాణరేవులో వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఈ మేరకు వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లను మంగళవారం సీఐ కిషోర్‌బాబుతో కలిసి వైఎస్సార్ సీపీ నాయకులు పరిశీలించారు. ఏలేరు నదిపై వంతెన దెబ్బతినడంతో రాకపోకలను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఏలేరు నదిపై వంతెన దెబ్బతినడంతో వాహనాలు, ప్రజల రాకపోకలను నిషేధించామన్నారు. భక్తులు తాము సూచించిన మార్గం ద్వారా రాకపోకలు సాగించాలని కోరారు. అనంతరం ఏర్పాట్లపై మున్సిపల్ కౌన్సిలర్ అలమండ చలమయ్యతో చర్చించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సతీష్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అలరించిన కోలాట ప్రదర్శన


ప్రత్తిపాడు పంచాయతీ వద్ద కోలాట ప్రదర్శన

ప్రత్తిపాడు: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం రాత్రి నిర్వహించిన కోలాట ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో నూతనంగా శ్రీవిజయ గాయత్రి కోలాట భజన మండలిని ఏర్పాటు చేసి కోలాటంలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తికావడంతో భజన మండలి సభ్యులు గజ్జ పూజా మహోత్సవం నిర్వహించారు. గురువు నిమ్మగడ్డ వెంకట శివరామకృష్ణ గజ్జ పూజ చేసి, కోలాట బృందం సభ్యులకు గజ్జెలను అందజేశారు. ఈ సందర్భంగా బృంద సభ్యులు ప్రదర్శించిన కోలాటం గ్రామ ప్రజలను ఆకట్టుకుంది. అనంతరం గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, ఉప సర్పంచ్ మదినే సూకరాజులను కోలాట భజన మండలి అధ్యక్ష, కార్యదర్శులు శేషుకుమారి, రమాదేవిలు షీల్డు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

కౌహగ్.. మానసిక సమస్యలకు చెక్


ఆవును ఆలింగనం చేసుకుంటున్న మహిళ

- నేడు కౌహగ్ థెరపీ డే
- సుమారు 500 ఆవులతో కౌహగ్ కార్యక్రమం
- మానసిక, ఏకాగ్రత సమస్యలకు పరిష్కారం


లింగంపర్తిలోని గోశాల


గోశాలలోని పొట్టి ఆవులతో గడుపుతున్న పర్యాటకులు

ఏలేశ్వరం: నేటి యువత పాశ్చాత్య దేశాల మోజులో పడి దేశ సంస్కృతిని పట్టించుకోవడం లేదు. మన సనాతన ఆచారాలను పాటించాలని తెలిపేందుకు మంగళవారం జాతీయ కౌ హగ్‌డే నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 14న వలంటైన్స్ డేతో పాటు కౌహగ్ థెరపీ డే నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నాడీపతి రీసెర్చ్ ఫౌండేషన్ వైద్యుడు పి.కృష్ణంరాజు ఆధ్వర్యంలో మండలంలోని లింగంపర్తిలో మంగళవారం సుమారు 500 ఆవులతో కౌహగ్ థెరపీ నిర్వహించి దీని ద్వారా కలిగే ప్రయోజనాలు వివరిస్తారు. నాడీపతి వైద్యుడు కృష్ణంరాజు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2010 నుంచి గత 12 ఏళ్లుగా కౌహగ్ నిర్వహిస్తున్నారు. విదేశీయులు ఎప్పటి నుంచో కౌహడలింగ్ పేరుతో గోవులతో గడుపుతున్నారు. సనాతన ధర్మంలో ప్రముఖ పాత్ర పోషించే గోమాత ద్వారా కలిగే ఆరోగ్యసూత్రాలపై అవగాహన కల్పించేందుకు కౌహగ్ జరుపుతున్నారు.


కౌహగ్ చేస్తున్న చిన్నారులు

కౌహగ్ థెరపీతో ప్రయోజనాలు ఇలా..

ఆవును ఆలింగనం చేసుకోవడం ద్వారా దాని శరీరం భావాలను, ఉష్ణోగ్రతలను, వాసనలను గ్రహించి మెదడును ఉత్తేజపరిచే చికిత్స కౌహగ్‌థెరపీ. దీని ద్వారా మన శరీరంలో జరిగే మార్పులకు మెదడులోని పిట్యూటరీ గ్రంధి ఉద్దీపన చెంది కార్టిసోల్, ఆక్సిటోసిన్, డోపోమైన్, సెరోటోనిన్ తదితర హార్మన్లు సక్రమంగా శరీరంలోకి ప్రవేశింపచేసి నాడులను ఉత్తేజపరుస్తుంది. దీని వలన మానసిక సమస్యలు, ఏకాగ్రత లేకపోవడం వంటి సమస్యలు పరిష్కామవుతాయి.

లింగంపర్తిలో గోశాల

గత మూడేళ్లుగా లింగంపర్తి గ్రామంలో సుమారు 200 ఆవులతో గోశాల నిర్వహిస్తున్నారు. ఈ గోశాలలో వుంగనూరు పొట్టిజాతి ఆవులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. గతంతో ఇక్కడ కౌహగ్‌థెరపీ నిర్వహించారు. కాకినాడ, ఈ గోశాలలో అనేక మందికి వైద్యం చేస్తున్నారు.

కౌహగ్‌థెరపితో అనేక ప్రయోజనాలు



కౌహగ్‌థెరపితో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. కౌహగ్‌తో మానసిక సమస్యలతో పాటు ఏకాగ్రత లోపించడం లాంటి సమస్యలు తీరతాయి. కనీసం పది నిమిషాలు కౌహగ్ చేసుకోవడం ద్వారా ఆరోగ్యం మెరుగు పడుతుంది.

– పి కృష్ణంరాజు, నాడీపతి వైద్యుడు

ప్రమాదాల నివారణపై అవగాహన


ప్రత్తిపాడు జాతీయ రహదారిపై ఆటో ప్రయాణికులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కిషోర్‌బాబు

ప్రత్తిపాడు: స్థానిక జాతీయ రహదారిపై ప్రయాణికులకు సోమవారం సీఐ కె.కిషోర్‌బాబు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రత్తిపాడు – ఏలేశ్వరం మార్గంలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సీఐ కిషోర్‌బాబు వాహన తనిఖీలు చేశారు. ఓవర్ లోడ్, ఓవర్ స్పీడ్‌తో వెళుతున్న వాహనాలను నిలుపుదల చేసి, కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు జరిమానాలు విధించారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, అన్ని రికార్డులు సక్రమంగా ఉండాలని, డ్రైవర్ పక్కన ప్రయాణికులను కూర్చోబెట్టరాదని సూచించారు. నిబంధనలు పాటించని ఆటో, కారు, ఇతర వాహనాల డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు పోలీసులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు


వాకపల్లిలో పాడైన చేతి పంపులను రిపేర్ చేయిస్తున్న గ్రామ సర్పంచ్ నాగేశ్వరరావు


గౌరంపేటలో ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికుడు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని వాకపల్లిలో సోమవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రొంగల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది గ్రామంలో చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైనేజీలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పాడైన చేతి పంపులను రిపేర్ చేయించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని గ్రామ సర్పంచ్ రొంగల నాగేశ్వరరావు కోరారు.

డ్రైన్లలో పూడికతీత

కిర్లంపూడి: జగపతినగరం పంచాయతీ చిల్లంగిలో సోమవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వార్డు మెంబర్ పిల్లా హైమావతి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని గౌరంపేట సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు అన్నారు. మండలంలోని గౌరంపేటలో సోమవారం పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచకారీ చేశారు. పరిశుభ్రతే లక్ష్యంగా గ్రామంలో అధికారులు పని చేయాలని సర్పంచ్ ఏసుబాబు సూచించారు.

బెండపూడిలో ఫాగింగ్

తొండంగి: గ్రామంలో దోమల నివారణకు చర్యలు చేపట్టామని బెండపూడిలో పంచాయతీ కార్యదర్శి వాడ్రేవు చక్రవర్తి తెలిపారు. గ్రామంలోని ఎస్సీపేట, తూర్పుకాపుల వీధి, బీసీ కాలనీ, సాలిపేట తదితర ప్రాంతాల్లో దోమల నివారణకు సోమవారం పంచాయతీ సిబ్బంది ఫాగింగ్ చేశారు. ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా పని చేస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి చక్రవర్తి తెలిపారు.

దేవరమ్మతల్లికి ప్రత్యేక పూజలు



కిర్లంపూడి: మండలంలోని వేలంకలో వేంచేసిన దేవరమ్మ తల్లి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయం వద్ద భజనలు చేశారు. గురువారం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిళ్లు దగ్ధం


మెరక చామవరంలో కాలిబూడిదైన తాటాకిళ్లు

రౌతులపూడి: మండలంలోని మెరక చామవరంలో పెదపూడి వరలక్ష్మి, నిండుకుండల దొంగయ్యలకు చెందిన రెండు తాటాకిళ్లు సోమవారం దగ్ధమయ్యాయి. మధ్యాహ్నం 3 గంటల సమయంలో పెదపూడి వరలక్ష్మి ఇంటిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయ్యి మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో రెండిళ్లలోని ఫర్నిచర్, టీవీలు, దుస్తులు, వంట సామగ్రి, నిత్యావరాలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. స్థానికులు ప్రత్తిపాడు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వేంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు బాధితులు తెలిపారు. వీఆర్‌ఓ ఆరుణకు ప్రమాద స్థలాన్ని పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. నివేదికను తహసీల్దార్‌కు అందజేస్తామన్నారు. బాధితులకు సర్పంచ్ అడపా సత్యవాణి, మురళి దంపతులు ఒక్కో కుటుంబానికి 50 కిలోలు చొప్పున బియ్యం, కూరగాయలు, కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రామకుర్తి బాబ్జీ, ఎమ్మిలి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు


రత్నగిరిపై విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత (ఫైల్)


విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఈఈ సూర్యనారాయణ, దేవస్థానం అధికారులు

- రత్నగిరిపై రూ.4.5 కోట్లతో నిర్మిస్తున్న ఏపీఈపీడీసీఎల్
- పనులను పరిశీలించిన అధికారులు

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి నిరంతరాయంగా విద్యుత్ వెలుగులు ప్రసరించేందుకు ఉద్దేశించిన 'ఇన్‌డోర్ 33కేవీ విద్యుత్ సబ్ స్టేషన్' నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణానికి గత నెల 30న రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ శంకుస్థాపన చేసిన విషయం విదితమే. రత్నగిరిపై సీఆర్వో ఆఫీసు పక్కన 120 అడుగుల పొడవు 80 అడుగుల వెడల్పున 1048 గజాల స్థలాన్ని దేవస్థానం కేటాయించగా ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) రూ. 4.5 కోట్లతో ఈ సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తోంది. ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇది ఇండోర్ సబ్‌స్టేషన్ అవ్వడం వలన రెండు భవనాలు నిర్మించాలని, సబ్‌స్టేషన్ అంతా ఆ భవనాల్లో ఉంటుందని, భయటకు కనిపించదని ఏపీఈపీడీసీఎల్ డీఈఈ సూర్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన దేవస్థానం డీఈ టి.సూర్యనారాయణ, రిటైర్డ్ డీఈ రాంబాబుతో కలిసి పనులను పరిశీలించారు.

మార్చి నెలాఖరుకల్లా పనులు పూర్తి చేయాలి

వచ్చే వేసవిలో దేవస్థానంలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుందని, ఈ నేపథ్యంలో మార్చి నెలాఖరు కల్లా ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి చేయాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులను దేవస్థానం విద్యుత్ శాఖ డీఈ సూర్యనారాయణ కోరారు. అందుకు వారు సుముఖత వ్యక్తం చేశారని ఆయన వివరించారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే సత్యగిరి, రత్నగిరితో పాటు కొండ దిగువన గల సత్రాలకు కూడా నిరాటంకంగా విద్యుత్ సరఫరా జరుగుతుందని డీఈ వివరించారు.

కల్వర్టు శిథిలం


తుని దివాణం వీధిలో కల్వర్టు శిథిలమై పైకి లేచిన ఇనుప ఊచలు

తుని: పురపాలక సంఘం పరిధిలో రోడ్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దివాణం వీధి జంక్షన్‌లో సీసీ రోడ్డు కల్వర్టుపై వేసిన శ్లాబు పలకలు ఛిద్రమయ్యాయి. ఇనుప ఊచలు బయటకు రావడంతో వాహన చోదుకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో చాలా మంది ఇందులో పడి గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. సమస్యను పురపాలకసంఘం ఇంజినీరింగ్ విభాగం ఇన్‌చార్జి డీఈఈ ప్రకాశరావు దృష్టికి తీసుకువెళ్లగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.